..2 లక్షల కొలువులిస్తం

మొదటిపేజీ తరువాయి...

యువ వికాసం, చేయూత అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని, త్వరలోనే మరో రెండు గ్యారెంటీలు రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు పథకాలను అమలు చేయబోతున్నట్టు చెప్పారు. ఇటీవలి ప్రజా పాలన కార్యక్రమంలో 1.28 కోట్ల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ గత వైభవాన్ని పునరుద్ధరించాల్సి ఉన్నదని, రాష్ట్రమంతటా అభివృద్ధిని వికేంద్రీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పారిశ్రామిక, సేవారంగాల వృద్ధికి నూతన విధానాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్టు తెలిపారు. చిన్న పారిశ్రామికవేత్తల బలోపేతానికి నూతన ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకురానున్నట్టు వెల్లడించారు. వెయ్యి నుంచి మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో రాష్ట్రవ్యాప్తంగా 10 నుంచి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దావోస్ పర్యటనలో తమ ప్రభుత్వం రూ.40వేల కోట్లకు పైగా పెట్టుబడులను రాబట్టినట్టు తెలిపారు. కృత్రిమ మేధను మరింత వినియోగించుకొనేందు కు రాష్ట్రంలో 50 నుంచి 100 ఎకరాల్లో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ'ని ఏర్పా టు చేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్తు ఉత్పాదక వ్యయాన్ని తగ్గించేందుకు సౌర, పవన విద్యుత్తును ప్రోత్సహిస్తామని, ఇందుకు ప్రత్యేక ఇంధన పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. రూ. 2వేల కోట్లతో ప్రభు త్వ ఐటీలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మార్చబోతున్నామని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. సామాజికవర్గాల వారీగా న్యాయం చేసేందుకు రాష్ట్రంలో కులగణన చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. బడ్జెట్ వార్షిక మొక్కుబడి ఆర్థిక పత్రం కాదని గుర్తుంచుకోవాలని, ఆశించిన అభివృద్ధికి అనుగుణంగా కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలింపజేస్తుందని తెలిపారు. ప్రజాకవి కాళోజీ పద్యంతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి సూక్తితో ముగించారు.

అంతా తప్పు.. తప్పు

గవర్నర్ తమిళిసై ప్రసంగంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె ప్రసంగిస్తున్న సమయంలో ఫాల్స్ ఫాల్స్(అతా తప్పు తప్పు) అంటూ పలుమార్లు నినాదాలు చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని గవర్నర్ చెప్పుండగా.. 'అది అంతా ఫాల్స్ ఫాల్స్' అంటూ హరీశ్‌రావుతో పాటు మరికొందరు నినాదాలు చేశారు. అదే విధంగా త్వరలోనే రెండు గ్యారెంటీలను అమలు చేస్తామని గవర్నర్ ప్రకటించగా.. మిగిలిన హామీల అమలు ఎప్పుడంటూ ప్రశ్నించారు. గత సెషన్‌లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తమ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిందని గవర్నర్ తెలపగానే అదంతా ఫాల్స్ ఫాల్స్ అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినదించారు. రైతులకు రైతుభరోసా, రుణమాఫీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ ప్రకటించగానే.. ఇంకా రైతులకు రైతుబంధు పడలేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. దావోస్ పర్యటనలో రూ. 40వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ గవర్నర్ చెప్పగానే అది కూడా తప్పు తప్పు అంటూ నినాదాలు చేశారు.

అన్నీ అర్ధసత్యాలే

మీడియా పాయింట్

- కానరాని విజన్ డాక్యుమెంట్
- ప్రతిష్ఠను దిగజార్చేలా ప్రసంగం
- మహిళలు, రైతులకు తీవ్ర నిరాశ
- నిరుద్యోగ భృతిపై ప్రస్తావన లేదు
- రుణమాఫీ, పంట బోనస్ లేనట్టేనా?
- మిగిలిన గ్యారెంటీల పరిస్థితేంటి?
- 40 రోజులే.. ఈలోగా 'కోడ్' వస్తే?
- యాదాద్రి పవర్‌ప్లాంట్ మాట ఏదీ?
- హామీలు అమలుకాకుంటే పోరే
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గురువారం మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ చేసిన ప్రసంగం అర్ధ సత్యాలతో అత్యంత పేలవంగా ఉన్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ హామీల అమలుపై వేయి కండ్లతో ఎదురుచూస్తున్న ప్రజలు గవర్నర్ ప్రసంగంతో భంగపడ్డారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తయారు చేయించిన గవర్నర్ ప్రసంగంలో విజన్ లోపించిందని విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. నెలకు రూ.4 వేల పింఛన్‌పై ప్రకటన కోసం ఎదురుచూసిన వృద్ధులు, దివ్యాంగులు, నెల కు రూ.2,500 అమలు ప్రకటనపై ఆశపడ్డ మ హిళలు, రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రూ. 500 బోనస్ ప్రకటనపై రైతులు, రూ.4వేల నిరుద్యోగ భృతిపై నిరుద్యోగులు వేయి కండ్లతో ఎదురుచూసి భంగపడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. పల్లెలు, పట్టణ ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై ప్రకటన చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు.

గవర్నర్ ప్రసంగంలో అసత్యాలు

గవర్నర్ ప్రతిష్ఠను దిగజార్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఆమెతో అర్ధ సత్యాలు చదివించిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల్లో రెండు అమలు చేశామడం దారుణమని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల్లో మొత్తం 13 హామీలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిల్లో ఉచిత బస్ ప్రయాణమే అమలు చేస్తున్నారని చెప్పారు. త్వరలో 200 యూనిట్లకు గృహ జ్యోతి, రూ.500కు గ్యాస్‌సిలిండర్ పథకం అమలు చేస్తామనే చెప్పారని, ఈ మాత్రానికి ఆరు గ్యారెంటీల్లో రెండు అ మలు చేసినట్టు చెప్పుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలను ఎప్పటికల్లా అమలు చేస్తారో చెప్పకపోవడం దారుణమని అన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు వాయిదా

డిసెంబర్ 9న ప్రమాణం చేస్తామని, అదే రోజు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల వేళ రేవంత్‌రెడ్డి చెప్పిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రమాణస్వీకారాన్ని 7వ తే దీకి ముందుకు జరుపుకొని, ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం వాయిదా వేస్తున్నారని ఎద్దేవా చేశారు. నాడు ప్రమాణస్వీకారాన్ని ముందుకు జరపడంలో ఉన్న ఆతృత, ప్రేమ.. రైతులకు రుణమాఫీ, పంటలకు రూ.500 బోనస్ ధర, ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంచడంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 60 రోజులు అవుతున్నదని, వారు కోరిన వంద రోజుల గడువుకు ఇంకా 40 రోజులే మిగిలి ఉన్నాయని గుర్తుచేశారు. మరో 15 రోజుల్లో ఎలక్షన్ కోడ్ వచ్చే అవకాశం ఉన్నదని, కోడ్ వస్తే హామీల అమలు ఎలా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం రూ.500 గ్యాస్, 200 యూనిట్ల కరెంటు అమలు చేస్తే, మిగిలిన హామీలు ఈ ఏడాది అమలు చేయనట్టేనా? అని నిలదీశారు.

కాంగ్రెస్‌తో రైతులకు తీవ్ర అన్యాయం

కాంగ్రెస్ వస్తే రైతులకు మేలు చేస్తామన్న నాయకులు వారిపై కనీసం శ్రద్ధ చూపడం లేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తామని చెప్పి తామిచ్చిన రూ.10 వేలను సైతం ఇవ్వకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. వడ్లు అమ్మొద్దని, అధికారంలో రాగానే ఇస్తామన్న రూ.500 బోనస్ ఏమైందని ప్రశ్నించారు. రైతులకు తాము 24 గంటల ఉచిత కరెంటు ఇస్తే, ఇప్పుడు 15 గంటలు కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని చెప్తున్నారని, ఎవరెవరు ఎంతెంత పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చారో శ్వేతపత్రం విడుదల చేసి, ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యుత్తు ప్లాంట్లపై ప్రస్తావన ఏదీ?

కేసీఆర్ ప్రభుత్వం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులను 90% పూర్తి చేసిందని హరీశ్‌రావు చెప్పారు. దానిని సకాలంలో పూర్తి చేస్తే 4 వేల మెగావాట్ల విద్యుత్తు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ పవర్‌ప్లాంట్ గురించి కూడా గవర్నర్ ప్రసంగంలో లేదని మండిపడ్డారు. మూసీ నది ప్రక్షాళనకు కేసీఆర్ హయాంలోనే రూ.3,500 కోట్లతో 52 ఎస్టీపీలు ఏర్పాటు చేశామని, వాటి ద్వారానే మురికి నీరు మూసీకి రావడం లేదని వివరించారు. నాటి పనుల ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో లేదని పేర్కొన్నారు. ఉద్యోగులకు 7వ తేదీ దాటినా వేతనాలు రాలేదని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమం తుస్సుమన్నది..

ప్రగతిభవన్ పేరు మార్చి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం తుస్సుమన్నదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ప్రతిరోజూ ప్రజల నుం చి ఫిర్యాదులు స్వీకరిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మొదటిరోజులోని మొదటి గంట మినహా మళ్లీ అటువైపు వెళ్లలేదని మండపడ్డారు. మంత్రులు కూడా రెండు రోజుల కంటే ఎక్కు వ రాలేదని, ఆ తర్వాత మరో వారం రోజులు ఐఏఎస్ అధికారులు దరఖాస్తులు తీసుకున్నారని, ఇప్పుడు ప్రజాపాలన దరఖాస్తులను ప్ర జాభవన్ వేదికగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం, శుక్రవారమే దరఖాస్తులు తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తమ హయాంలో గ్రీవెన్స్ నిర్వహించి అధికారుల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించామని చెప్పారు.

గ్యారెంటీల గడువు గాయబ్!

- 100 రోజుల గడువును మరిచారు
- ఆ ఊసే లేకుండా గవర్నర్ ప్రసంగం
- 2 లక్షల పోస్టులకు 'గడువు' లేదు
- టీఎస్‌పీఎస్సీ ప్రకటన ద్వారానే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ
- అన్ని ఖాళీలెక్కడున్నాయని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులు
- ఎప్పటిలోగా భర్తీచేస్తారని ప్రభుత్వాన్ని నిలదీత
- గ్యారెంటీలను తప్పించుకొనేందుకే కాంగ్రెస్ గడువు మాయం చేసిందా?

హైదరాబాద్, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): 'వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతాం' ఇదీ సీఎం రేవంత్‌రెడ్డి నుంచి మొదలుకొని ప్రతి కాంగ్రెస్ నేత వరకు గ్యారెంటీల అమలుపై నిత్యం చెప్తున్న మాట. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అయితే ఏయే తేదీల్లో ఏమేమి అమలు చేస్తామన్నది తేదీల తోసహా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పూ నోటిఫికేషన్ల తేదీలను కూడా ప్రకటించారు. ఈ లెక్క ప్రకారం ఈ నెల 1వ తేదీనే గ్రూప్-1 నోటిఫికేషన్ రావాలి. కానీ, ఇప్పటికీ దాని ఊసే లేదు. ఇదిలా ఉండగా, తాజాగా ఆరు గ్యారెంటీల అమలుపై కూడా రేవంత్ సర్కారు నాలుక మడతేసినట్టే కనిపిస్తున్నది. బడ్జెట్ సమావేశాల తొలిరోజు గురువారం గవర్నర్ తమిళిసై ఉభయసభల సంయుక్త సమావేశంలో చేసిన ప్రసంగంలో '100 రోజుల గడువు' అనే మాట ఎక్కడా వినిపించలేదు. దీంతో గ్యారెంటీల అమలు గడువు గాయబ్ అయిందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

2 లక్షల ఉద్యోగాలకూ 'గడువు' లేదు

అసెంబ్లీ తొలి ఉమ్మడి సెషన్‌లో రెండు లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటాం అని గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం స్పష్టంగా తెలిపింది. ప్రస్తుత ఉమ్మడి సెషన్‌లో ఆ మాట కూడా మారిపోయింది. కొత్తగా ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్సీ ద్వారా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన 'ఏడాది గడువు' కూడా మాయమైంది. 2024 డిసెంబర్‌లోపు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. గవర్నర్ ప్రసంగంలో ఆ మాటను ఎందుకు పెట్టలేదనే చర్చ జరుగుతున్నది. మరో విషయం ఏమిటంటే 2 లక్షల ఉద్యోగాలు టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని గవర్నర్ ప్రకటించటం. ఒక్క టీఎస్‌పీఎస్సీ ద్వారానే 2 లక్షల ఉద్యోగాల భర్తీ సాధ్యమయ్యే పనేనా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఏటా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు ఎందరు? ఈ ఏడాది రిటైర్ అవుతున్నవారు ఎందరు? ఏడాదిలో టీఎస్‌పీఎస్సీ ద్వారా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలంటే అంతమేరకు ఖాళీలు ఉన్నాయా? ఇప్పుడు ఉన్న ఉద్యోగ ఖాళీలెన్ని? వాటిల్లో భర్తీ చేయగలిగే పోస్టులు ఎన్ని? అని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం చెప్పినట్టు టీఎస్‌పీఎస్సీ ద్వారానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీచేయాలంటే ఏడాది సంగతి దేవుడెరుగు.. వచ్చే ఐదేండ్లలో కూడా సాధ్యం కాదని అంటున్నారు. ఇప్పటికే గ్రూప్-1 గడువు తప్పిపోయిందని, దానిపై ప్రభుత్వం కనీసం వివరణ కూడా ఇవ్వలేదని గుర్తుచేస్తున్నారు. అసెంబ్లీ మొదటి సమావేశాల్లో ఉన్న 'గడువు' పదం రెండో సమావేశాల్లోనే మాయమైందని, మరో సమావేశం వచ్చే సమయానికి మొత్తం ఉద్యోగాల గ్యారెంటీనే మాయమవుతుందేమోనని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఆరు గ్యారెంటీల అమలు నుంచి తప్పించుకునేందుకే ప్రభుత్వం 'గడువు' ఎత్తేసిందా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

'నిర్దిష్టం'గా మారిన 'గడువు'

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే గత ఏడాది డిసెంబర్ 15న శాసనసభ, శాసనమండలి కలిపి ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై ప్రసగింస్తూ 'ఆరు గ్యారెంటీలను వచ్చే 100 రోజుల్లో అమలుచేసేందుకు కార్యాచరణ తీసుకుంటాం' అని స్పష్టంగా తెలిపారు. రెండు నెలల్లోనే ఆ మాట స్థానంలో కొత్త రాగం వచ్చి చేరింది. గురువారం నాటి ప్రసంగంలో ఆ పదమే ఉచ్చరించలేదు. మొత్తం 15 పేజీల ప్రసంగంలో ఒక్కటంటే ఒక్క చోట కూడా 100 రోజుల గడువు పదమే లేకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. 100 రోజుల గడువు స్థానంలో 'నిర్దిష్ట సమయంలోపు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం' అని పేర్కొన్నారు. 100 రోజుల గడువు కాస్తా.. నిర్దిష్ట సమయంగా మారిపోయింది. మరి నిర్దిష్ట సమయం అంటే ఎంత సమయమో ఎవరికీ తెలియదు. దీనిపై ప్రభుత్వమే స్పష్టతనివ్వాల్సిన అవసరం ఉన్నది.

అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం. ఎమ్మెల్సీ మధుసూదనాచారి

4 కాదు 12 రోజులు సభ పెట్టాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 12 రోజులపాటు నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. బీఏసీ మీటింగ్‌లో సభను 4 రోజులే నిర్వహిస్తామని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసిందని చెప్పారు. బీఏసీ సమావేశం అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. బడ్జెట్‌తోపాటు ప్రజా సమస్యలు చర్చించేందుకు 4 రోజులు ఎలా సరిపోతాయని ప్రశ్నించామని చెప్పారు. దీంతో 13న అవసరమైతే మరోసారి బీఏసీ సమావేశం నిర్వహిస్తామని స్పీకర్ చెప్పారని తెలిపారు.

దక్షిణ తెలంగాణ ఆందోళన: ఎమ్మెల్సీ

కేఆర్ఎంబీ విషయంలో దక్షిణ తెలంగాణ ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి పేర్కొన్నారు. ప్రసంగం ఆ సాంతం వాస్తవాల వక్రీకరణ జరిగిందని మండిపడ్డారు. కేఆర్ఎంబీ ప్రస్తావన ఎందుకు లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఫార్మాసిటీపై అయోమయం లేదు: రంగారెడ్డి,ఆది శ్రీనివాస్

ఫార్మా సిటీ విషయంలో ప్రజలకు ఎలాంటి అయోమయం అవసరం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. గవర్నర్ ప్రసంగం అద్భుతంగా ఉన్నదని, అందుకే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ భాష మార్చుకోవాలి: చంద్రూనాయక్,వంశీకృష్ణ

కాంగ్రెస్ పాలన చూసి ఓర్వలేకపోతున్న బీఆర్ఎస్ నాయకులు తక్షణమే తమ భాష మార్చుకోవాలని ఎమ్మెల్యే చంద్రూనాయక్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని ఆ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చెప్పారు.

హరీశ్‌రావు మాటలు హాస్యాస్పదం: రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

గవర్నర్ ప్రసంగంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉన్నదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రామ్మోన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇస్తే ఓర్వలేక పోతున్నారని విమర్శించారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే కేఆర్ఎంబీ: పాయల్‌శంకర్, హరీశ్‌బాబు

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేఆర్ఎంబీని తెరమీదకు తెచ్చాయని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, హరీశ్‌బాబు పేర్కొన్నారు.

ప్రతిపక్ష నేతకు ఇరుకు గది!

- ఏండ్ల సంప్రదాయానికి తిలోదకాలు
- ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్, జానారెడ్డికి కేటాయించిన గది కాకుండా మరొకటి కేటాయింపు
- చిన్న గది కేటాయింపుపై సభాపతి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ఎన్నో దశాబ్దాలుగా అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేతకు కేటాయిస్తున్న గదికి బదులుగా కేసీఆర్‌కు ఇప్పుడు మరో ఇరుకు గది కేటాయించడం వివాదస్పదమైంది. తరతరాలుగా ఇన్నర్ లాబీలకు ఆనుకొని ఉన్న ప్రధాన ప్రతిపక్ష నేత గదిని పూర్తిగా మూసివేసి, దానిని స్పీకర్ కార్యాలయానికి కేటాయించారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. గత సంప్రదాయాల ప్రకారం ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్‌కు ఇన్నర్ లాబీలకు పక్కనే ఉన్న ప్రధాన ప్రతిపక్ష నేత గదిని కేటాయించాల్సి ఉంటుంది. కానీ, ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేతకు చిన్నగదిని సాధారణ లాబీల్లో కేటాయించారు. సాధారణంగా ప్రతిపక్ష నేత కార్యాలయం, ఆయన గది దాదాపు ముఖ్యమంత్రి కార్యాలయం, గదికి సరిసమానంగా ఉంటాయి. ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కే జానారెడ్డి ప్రతిపక్ష నేతలుగా ఉన్నపుడు దీనినే ఉపయోగించారు. ఈసారి కేసీఆర్‌కు ఆ గది కాకుండా ఇంకో చిన్న గదిని కేటాయించడంపై విమర్శలొస్తున్నాయి. తమ నేతకు ఎలాంటి సౌకర్యాలు లేని చిన్నగదిని కేటాయించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారు ఇదే విషయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన ప్రతిపక్ష నేతకు కేటాయించిన కార్యాలయం, గది ఏమాత్రం బాగోలేవని, ఇదేం పద్ధతంటూ ఆవేదన వ్యక్తంచేశారు. దీనిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని ఎమ్మెల్యే లందరూ స్పీకర్ వద్దకు వెళ్లి గురువారం ఉదయం చెప్పారు. తమ పార్టీకి ఉన్న బలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచిగా ఉన్న గదులను కేటాయించాలని కోరారు.

మీడియా లాంజ్‌కు తాళం

అసెంబ్లీలోని మీడియా లాంజ్‌కు సైతం తాళం వేశారు. గతంలో ఇక్కడి లాబీల్లో విశేషాలను కవర్ చేసే రిపోర్టర్లు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండేవి. ఒక టీవీ, మంచి నీళ్ల వంటి సౌకర్యాలు ఉండేవి. బడ్జెట్ సమావేశాల ప్రారంభమైన తొలిరోజే మీడియా లాంజ్‌కు తాళం వేయడంతో మీడియా ప్రతినిధులు అక్కడ నిలబడే ఉండాల్సి వచ్చింది. గతంలో శాసనసభలో ముఖ్యమంత్రి కార్యాలయం వద్ద ఉండే లాబీల వరకు మీడియా ప్రతినిధులను అనుమతించేవారు. కానీ, గురువారం ఆఫీసర్ల లాంజ్‌కు ఎదురుగా, లిఫ్టుల పక్కన ఉన్న అద్దాల తలుపులను మూసివేశారు. ఎందుకు మూసివేశారన్నదానిపై స్పష్టత లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అటునుంచి రాకపోకలు సాగిస్తారని, మీడియాకు అనుమతి లేదని అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది చెప్పారు.

మార్షల్స్‌తో నిండిన లాబీలు

గవర్నర్ ప్రసంగం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళనలకు దిగుతారేమోనన్న అనుమానంతో శాసనసభ లాబీల్లో భారీగా పోలీసు మార్షల్స్‌ను మోహరించారు. గవర్నర్ ప్రసంగించే వరకు మార్షల్స్ ఇన్నర్ లాబీల్లోనే ఉన్నారు. గవర్నర్ ప్రసంగం ముగిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభాప్రాంగణం నుంచి వెళ్లిపోయే మార్షల్స్ లోపలే ఉండటం గమనార్హం.

మంత్రిపదవి ఎప్పుడొస్తుంది?

రాజగోపాల్‌రెడ్డితో కేటీఆర్ సంభాషణ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ అవరణలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. 'మీకు మంత్రి పదవి ఎప్పుడు వస్తుంది' అని రాజగోపాల్‌రెడ్డిని కేటీఆర్ అడిగారు. దీంతో 'మీ లాగానే మా మీద కూడా ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతున్నది' అని రాజగోపాల్‌రెడ్డి జవాబిచ్చారు. 'ఫ్యామిలీ పాలన కాదు, మంచిగా పని చేస్తే కీర్తి, ప్రతిష్ఠలు వస్తాయి' అని కేటీఆర్ చెప్పారు. 'ఎంపీగా మీ కూతురు కీర్తి పోటీ చేస్తుందా? కొడుకు సంకీర్త్ పోటీ చేస్తాడా?' అని కేటీఆర్ అడగడంతో దయచేసి తనను కాంట్రవర్సీలోకి లాగొద్దని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తొలుత మీడియా చిట్‌చాట్‌లో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు హోం మంత్రి కావాలని ఉన్నదని చెప్పడం విశేషం. నల్లగొండ ఎంపీ స్థానానికి తమ కుటుంబం నుంచి ఎవరూ పోటీలో ఉండరని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థిని గెలిపిస్తామని, బీసీలకు ఇచ్చినా, ఎవరికి ఇచ్చినా గెలిపిస్తామని చెప్పారు.

ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా అసెంబ్లీకి ఆటోలో వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ఆటోలో అసెంబ్లీకి!: ఆటో డ్రైవర్లకు పాడి సంఘీభావం

హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీకి ఆటోలో వచ్చి ఆటో డ్రైవర్లకు సంఘీభావం తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం వల్ల తీవ్రంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆయన ఆటోలో వచ్చారు. అయితే పోలీసులు ఆ ఆటోను అసెంబ్లీ గేటు వద్ద నిలిపివేశారు. ఆటోకు లోపలికి ప్రవేశం లేదని, ఇక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లాలని అసెంబ్లీ సిబ్బంది, పోలీసులు సూచించారు. తాను అసెంబ్లీ సభ్యుడినని, ఏ వాహనంలోనైనా వచ్చే అధికారం ఉన్నదని, పోలీసులు ఏ విధంగా అడ్డుకుంటారని ప్రశ్నించారు. పోలీసులు ఆటోను పక్కకు పంపించారు. అయినా మరోసారి యూటర్న్ తీసుకొని వచ్చినా కూడా పోలీసులు అనుమతించలేదు. దీంతో కౌశిక్ రెడ్డి నడుచుకుంటూ లోపలికి వెళ్లారు.

వాళ్ల చాంబర్ల చుట్టూ తిరుగుతున్నా: కాంగ్రెస్ ఎమ్మెల్యే